
www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 22 మే 2024

5

తిరుపతి



తిరుమలలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి


టిటిడి అధికారులు ఘన స్వాగతం



ప్రజాశక్తి -తిరుమల

శ్రీవారి దర్శనార్థం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిరుమలకు చేరుకున్నారు. మంగళవారం రాత్రి పద్మావతి నగర్‌లోని అతిథి గృహం వద్దకు చేరుకున్న రేవంత్ రెడ్డి దంపతులకు టిటిడి ఈవో ధర్మారెడ్డి స్వాగతం పలికారు. రాత్రికి తిరుమలలో రేవంత్ రెడ్డి బస చేయనున్నారు. మనవడికి పుట్టు వెంట్రుకలు మొక్కుబడిని స్వామివారికి తీర్చనున్నారు. బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శనంలో రేవంత్ రెడ్డి దంపతులు స్వామివారిని దర్శించుకొని తిరుగు ప్రయాణం కానున్నారు. ఈ సందర్భంగా పలువురు ఏపీ కాంగ్రెస్ నేతలు ఆయనను కలవడానికి వచ్చారు.

అనారోగ్య 'శ్రీ'



పెండింగ్ బిల్లుల కోసం నిరీక్షణ
ఉమ్మడి జిల్లాల్లో రూ.160 కోట్ల పైమాటే

9 నెలలుగా పైసా విదల్చని ప్రభుత్వం
ఆరోగ్యశ్రీ నెట్‌వర్కు ఆస్పత్రుల గగ్గోలు

ప్రజాశక్తి - తిరుపతి

'చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ వైద్య రంగం స్వరూపాన్నే మార్చేశాం.. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స వ్యయ పరిమితిని ఏకంగా రూ.5 లక్షల నుంచి 25 లక్షలకు పెంచుతూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నాం'**...ఎన్నికలకు ముందు ప్రభుత్వ డాంభికాలు**

'ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నెట్‌వర్కు ఆస్పత్రులకు ఇవ్వాల్సిన బకాయి రూ.160 కోట్ల పైమాటే. తొమ్మిది నెలలుగా ప్రభుత్వం పైసా విదిల్చిన పాపాన పోలేదు. ప్రైవేట్‌లో సిబ్బందికి జీతాలు సైతం చెల్లించలేని స్థితిలో ఉన్నాయి. బిల్లులు చెల్లించకపోతే ఇకపై వైద్యం చేయలేం..' **... ఆరోగ్యశ్రీ నెట్‌వర్కు ఆస్పత్రుల గగ్గోలు**

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 38 నెట్‌వర్కు ఆరోగ్యశ్రీ ఆస్పత్రులు ఉన్నాయి. వీటిలో ఆరోగ్యశ్రీతో పాటు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్, వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీమ్‌ల ద్వారా రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. అయితే గత తొమ్మిది నెలలుగా పెండింగ్ బకాయిలు రూ.160 కోట్లకు పైగా పేరుకుపోయి ఉంది.

కేంద్ర నిధుల పైనే ఆశలు

ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ సక్రమంగా నిధులు విడుదల చేసిన దాఖలాలు లేవు. ఏడాదికి రెండు మూడుసార్లయినా 'మేం వైద్యం అందించలేం బాబోయ్' అంటూ ఆరోగ్యశ్రీ నెట్ వర్కు ఆస్పత్రులు చేతులెత్తుస్తూ ఉంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రం అమలు చేసే ఆయుష్మాన్ భారత్ నిధులే ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌కు పెద్ద అండగా నిలుస్తున్నాయని తెలుస్తోంది. నెట్‌వర్క్ ఆస్పత్రుల బకాయిలకు ఆయుష్మాన్ భారత్ నిధులనే వాడుతున్నారని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఆరోగ్యశ్రీ ట్రస్టుకు, ఆయుష్మాన్ భారత్‌కు మధ్య నిధుల విషయంలో కొంత గందరగోళం ఏర్పడినట్లు సమాచారం. ట్రస్ట్‌లోని ఆర్థిక విభాగం ఆయుష్మాన్ భారత్‌కు ఇవ్వాల్సిన సమాచారాన్ని ఇవ్వకుండానే నిధులు విడుదల చేయాలని కోరింది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన నేషనల్ హెల్త్ ఏజెన్సీ (ఎన్‌హెచ్‌ఏ) ముందు తాము అడిగిన సమాచారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి గట్టిగా చెప్పినా ప్రయోజనం లేదన్న విమర్శలున్నాయి. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఆరోగ్యశ్రీ నిధుల విడుదల విషయంలో తమకే మాత్రం సంబంధం లేనట్లు వ్యవహరిస్తోంది తప్ప ఇతర నిధులను సర్దుబాటు చేసే పరిస్థితులు లేకపోవడం గమనార్హం.

'ఈహెచ్‌ఎస్' డబ్ల్యుజే హెచ్‌ఎస్ పరిస్థితి మరీ దారుణం

రాష్ట్రంలో ఉద్యోగుల ఆరోగ్య భద్రత పథకం (ఈహెచ్‌ఎస్) , వర్కింగ్ జర్నిస్టుల హెల్త్ స్కీమ్ ల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ పరిధిలో ఉన్న ఆస్పత్రులు ఈహెచ్‌ఎస్ అంటేనే వణికిపోతున్నాయి. వీటికి సంబంధించి ప్రతినెలా రూ.70 నుంచి రూ.80 లక్షల విలువైన బిల్లులు వస్తాయి. ఆ మాత్రం బిల్లులను కూడా చెల్లించలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందా ? అంటూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్రస్థాయిలో ప్రధాన బాధ్యతల్లో ఉన్న ఓ నేత విమర్శిస్తుండటం గమనార్హం. ప్రభుత్వంపై 'స్వరం' పెంచడానికీ వీరు భయపడుతూ ఉన్నారు. 'స్వరం' పెంచితే ఎక్కడ తమ ఆస్పత్రులకు వచ్చే బిల్లులు నిలిచిపోతాయేమోననే భయం వారిలో ఉన్నట్లుగా అర్థమవుతోంది.

ఎంఎస్‌ఆర్ చెంచులక్ష్మి కాలనీని కాపాడండి



విలేకరులతో చందమామల కోటయ్య

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

'అనాదిగా యానాదులను అడవులకే పరిమితం చేస్తూ అణగదొక్కుతూనే ఉన్నారని, నాగరికతకు అలవాటు పడదామంటే అడవులకే పొమ్మంటున్నారు. ఇదెక్కడి ఆటవిక న్యాయం' అని యానాది సంఘం రాష్ట్ర అధ్యక్షులు చందమామల కోటయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గిరిపుత్రులుగా పుట్టినందుకు తమకు అడవుల్లో కాకుండా మైదానాల్లో బతికే స్వేచ్ఛ లేదా..? అంటూ ప్రశ్నించారు. చందమామల కోటయ్య స్థానిక రాజీవ్ నగర్ కాలనీలోని యానాది సంఘం కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా రాజీవ్ నగర్ లో నూతనంగా ఏర్పడ్డ ఎమ్మెస్సార్ చెంచులక్ష్మి కాలనీలో గత కొంత కాలంగా యానాదులపై కొందరు భూ కబ్జాదారులు సాగిస్తున్న దౌర్జన్యకాండను మీడియాకు వివరించి కన్నీటి పర్యంతమయ్యారు. రాజీవ్ నగర్ సర్వే నెం.239, 240లలో సుమారు 2.20 ఎకరాల ప్రభుత్వ స్థలంలో 56 మంది యానాదులు 2014 నుంచి పునాదులు తవ్వి గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వీరికి ఇక్కడే ఆధార్, రేషన్ కార్డులు ఇచ్చారనీ.. విద్యుత్ సర్వేసులు కూడా ఉన్నాయని తెలియజేశారు. అయితే పట్టణానికి చెందిన ఓ మాజీ కౌన్సిలర్, వేడాం, కాళంగి గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు యానాదులు తవ్విన పునాదులను ధ్వంసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎదురుతిరిగితే దాడులు, దౌర్జన్యాలు, కుల దూషణలకు తెగబడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు అధికార, రెవెన్యూ, పోలీస్ అండ ఉందనీ.. మీకు దిక్కున్న చోట చెప్పుకోండంటూ బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిపార్సుల మేరకు యానాదులు ఎక్కడైనా గుడారాలు వేసుకుని స్వేచ్ఛగా జీవించే హక్కు కలదని వివరించారు. అలాంటిది ప్రభుత్వ భూమిలో పునాదులు వేసుకుంటే పట్టాలిచ్చి హక్కు కల్పించాల్సిందిబోయి వాటిని ధ్వంసం చేస్తుంటే వేడుక చూస్తున్నారంటూ అధికారులపై మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యానాదులపై దాడి చేసిన వారిని అరెస్టు చేసి ఎమ్మెస్సార్ చెంచులక్ష్మి కాలనీని కాపాడకుంటే జూన్ 14న పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. యానాది సంఘం నాయకులు రవీంద్ర, రత్న, శ్రీనివాసులు, మునస్వామి, నాగరాజు, రాధమ్మ, లలితమ్మ, మునెమ్మ, చెల్లెమ్మ తదితరులు పాల్గొన్నారు.

రవి మనోహర ఆచారి డిఎస్‌పిగా బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ




తిరుపతి డీఎస్పీగా కే.రవి మనోహర ఆచారి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఏసీబీ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఆయన ఎన్నికల పోలింగ్ రోజు, ఆ మరుసటి రోజు తిరుపతి, చంద్రగిరిలో జరిగిన అల్లర్లపై విచారణ చేపట్టిన సిట్ బృందానికి నాయకత్వం వహించారు. మంగళవారం తిరుపతిలో ఈస్ట్ డిఎస్‌పిగా బాధ్యతలు నిర్వహించారు. ఆయన గతంలో తిరుపతి ఈస్ట్ సిఐగా ఉన్నారు. బాధ్యతల స్వీకరణ అనంతరం మీడియాతో మాట్లాడుతూ తిరుపతిలో శాంతి భద్రతలను కాపాడటంలో తనవంతు కృషి చేస్తానని, గంగజాతరలో, త్వరలో జరగబోవు ఎన్నికల కౌంటింగ్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటానన్నారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్‌ను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం విజయవాడ ఏపీ సచివాలయంలోని సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వర్చువల్ విధానంలో వేజ్ జనరేషన్, తాగు నీటి సరఫరా, విద్యుత్ సరఫరా, శాంతి భద్రతలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె.ఎస్. జవహర్ రెడ్డి సమీక్షించారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్ మిని సమావేశ మందిరం వీడియో కాన్ఫరెన్స్ నుండి జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ సంబంధిత జిల్లా అధికారులతో కలిసి హాజరయ్యారు. అనంతరం శాంతి భద్రతలపై సిఎస్ సూచిస్తూ కలెక్టర్లు, ఎస్పీ తరచూ శాంతి భద్రతలపై సమీక్ష నిర్వహించాలని అన్నారు. కలెక్టర్ వివరిస్తూ కౌంటింగ్ సజావుగా జరిగేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని, జిల్లాలో తగినంత సిఎపిఎఫ్ బలగాలు వచ్చాయని, లూజ్ బాటిళ్లలో పెట్రోల్ అమ్మడం నిషేధానికి చర్యలు తీసుకుంటామని, గుర్తించిన అన్ని పాయింట్లలో కేంద్ర బలగాలకు విధులు ఎస్పీ కేటాయించారని, నో డ్రోన్ ఫ్లయింగ్ జోన్ గా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణము ఆదేశాలు ఇచ్చామని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో తిరుపతి మునిసిపల్ కమిషనర్ అదితి సింగ్, ఎస్ఈ మోహన్ రెడ్డి, ఎస్.ఈ ఏపీ ఎస్పీపీడీసీల్ కష్ణా రెడ్డి, ఇరిగేషన్ ఎస్ ఈ, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ్ కుమార్, డి పి ఓ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



వెంగమాంబ జయంతి ఉత్సవాల్లో జెఇఒ గౌతమి, కుసుమకుమారి

జన బాహుళ్యంలోకి వెంగమాంబ సాహిత్యం : జెఇఒ గౌతమి

ప్రజాశక్తి - క్యాంపస్

తరిగొండ వెంగమాంబ తన రచనల ద్వారా భావితరాలకు ఎనలేని సాహిత్య సంపదను అందించారని, జనబాహుళ్యంలోకి ఆమె సాహిత్యాన్ని టిటిడి తీసుకెళుతోందని జేఈఓ గౌతమి ఉద్ఘాటించారు. శ్రీవారి అపర భక్తురాలైన భక్త కవయిత్రి మాతశ్రీ తరిగొండ వెంగమాంబ 294వ జయంతి ఉత్సవాలు మంగళవారం తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ తరిగొండ వెంగమాంబ శ్రీవారిపై భక్తి శ్రద్ధలతో అనేక సంకీర్తనలు రచించారన్నారు. వెంగమాంబ సాహిత్యాన్ని, రచనలు, కీర్తనలను జన బాహుళ్యంలోకి తీసుకెళ్లేందుకు టీటీడీ కషి చేస్తోందన్నారు. ముత్యాల హారతి రూపంలో శ్రీవారిలో ఐక్యమయ్యారన్నారు. సాహితీ సదస్సుకు అధ్యక్షత వహించిన అనంతపురం ఎస్‌కె వర్సిటీ మాజీ ఉపకులపతి డా.కుసుమకుమారి మాట్లాడుతూ వెంగమాంబ ఎన్నో రచనలు చేసినా ఆమె రచనలకు గుర్తింపు రాలేదన్నారు. టీటీడీ తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టు ఏర్పాటు చేసి ఆమె సాహిత్యాన్ని, రచనలను వెలుగులోకి తీసుకొని వచ్చిందని చెప్పారు. శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ఛైర్మన్ డా. సాయికష్ణ యాచేంద్ర మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు అర్థం చేసుకునేందుకు వీలుగా జనరంజకమైన భాషలో వెంగమాంబ రచనలు చేశారని తెలిపారు. వెంగమాంబ పాటలు సామాన్య జనులు పాడుకునే విధంగా వుంటాయన్నారు. నెల్లూరుకు చెందిన ప్రాచీన విశిష్ఠ అధ్యయన కేంద్రం డా. లోకేశ్వరి మాట్లాడుతూ వెంగమాంబ సాహిత్యంలో భక్తి అనేది ప్రత్యేకంగా కనిపిస్తుందన్నారు. అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు డా. ఆకెళ్ళ విభీషణ శర్మ మాట్లాడుతూ వెంగమాంబ మొత్తం 18 రచనలు చేయగా, ఇందులో శ్రీ వేంకటాచల మహత్యం గ్రంథం చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్వేత సంచాలకులు భూమన్ సుబ్రహ్మణ్యం రెడ్డి పాల్గొన్నారు.

తిరుపతిలో ఎస్‌పి ముమ్మర తనిఖీలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి జిల్లా నూతన ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు బాధ్యతలు చేపట్టిన రోజు నుండే తనదైన శైలిలో జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. అందులో భాగంగా మంగళవారం తిరుపతి నగరంలోని ఎస్వీయూ క్యాంపస్, వెస్ట్, అలిపిరి పోలీస్ స్టేషన్లు, శాంతి భద్రతల అదనపు ఎస్పీ కార్యాలయము, ఈస్ట్ పోలీస్ స్టేషన్, తిరుపతి డిఎస్పి కార్యాలయము, జిల్లా సాయుధ దళ ప్రధాన కార్యాలయాలను జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. పోలీస్ స్టేషన్ల క్రైమ్ చార్ట్ లను పరిశీలించి, శాంతి భద్రతల పరిరక్షణకు, నేర నియంత్రణకు ప్రస్తుతం అవలంబిస్తున్న ప్రణాళికను తెలుసుకొని, లోటుపాట్లను సరి చేస్తూ భవిష్యత్ కార్యాచరణను జిల్లా ఎస్పీ వివరించారు. సిబ్బంది సాధక బాధలను అడిగి తెలుసుకున్నారు. ఎన్ని ఒత్తిడిలు ఎదురైనా పోలీసులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు కులశేఖర్, శ్రీనివాసరావు, డీఎస్పీలు రవి మనోహరాచారి, రవీంద్రారెడ్డి, సిఐలు శ్రీనివాసులు, మురళీ మోహన్ రావు, జయ నాయక్, మహేశ్వర రెడ్డి, అలిపిరి ఇన్చార్జ్ ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.

చంద్రగిరిలో విస్తృత తనిఖీలు : సిఐ

ప్రజాశక్తి రామచంద్రపురం (చంద్రగిరి)

సార్వత్రిక ఎన్నికల పోలింగ్, పోలింగ్ అనంతరం జరిగిన హింసాత్మక ఘటనలతో చంద్రగిరి పోలీసులు అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా అలర్ట్ అయ్యారు. సిట్ బందం చంద్రగిరి మండలంలోని రామిరెడ్డిపల్లి, కూచువారిపల్లి గ్రామాలలో పర్యటించి విచారణ చేపట్టింది. సిట్ బందం పర్యటన అనంతరం చంద్రగిరిలో సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి మంగళవారం కార్డెన్ సెర్చ్ చేపట్టారు. చంద్రగిరిలో ఎన్నికల ఫలితాల సందర్భంగా ఎలాంటి హింసాత్మక దాడులకు తావు లేకుండా శాంతిభద్రతల పరిరక్షణ కోసం ముగ్గురు సీఐలు, నలుగురు ఎస్ఐలు, 70 మంది కానిస్టేబుళ్లు బందంగా ఏర్పడి సోదాలు నిర్వహిస్తున్నారు. ఇళ్లు, దుకాణాల్లో మారణాయుధాలు, నేరాలకు ఉపయోగించే వస్తువులను గుర్తించే పనిలో పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఎం.రామయ్య తెలిపారు.సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన పోస్టులు పెడితే అడ్మిన్‌దే బాధ్యతన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ముగ్గురికి మించి గుమిగూడరాదన్నారు. చంద్రగిరిలో ఆదివారం నిర్వహించే వారపు సంతను రద్దు చేశారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు బాణసంచా పేల్చరాదని, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదని, గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాటిళ్లలో పెట్రోల్ పట్టరాదన్నారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో రౌడీ షీటర్లనపై, ట్రబుల్ మంగర్స్ పై ప్రత్యేక దష్టి పెట్టాలని సూచించారు. ఈ తనిఖీలలో భాకరాపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ మస్తాన్ వల్లి, తిరుచానూరు సిఐ శ్రీకాంత్, ఎస్సైలు అనిత, చిరంజీవి పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు



గూడూరు టౌన్ : ప్రజలు నివసించే ప్రాంతాల్లో అనుమానిత వ్యక్తులు,వాహనాలు ఏమైనా ఉన్నట్లయితే వెంటనే సంబధిత పోలీసు స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డి ప్రజలను కోరారు. జిల్లా ఎస్పీ హర్ష వర్ధన్ రాజ్ ఆదేశాల మేరకు పోలీసు బలగాలతో కలిసి మంగళవారం గూడూరు డీఎస్పీ రెండో పట్టణ పరిధిలోని గాంధీనగర్, ప్రశాంతి నగర్, ఇందిరమ్మ కాలనీ, టిడ్కో నివాస ప్రాంతాల్లో (కార్డన్ సెర్చ్) తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానిత వ్యక్తులు, పత్రాలు లేని వాహనాలను అదుపులోకి తీసుకుని రికార్డులు లేని వాహనాలను సీజ్ చేశారు. ఆయన వెంట సీఐ లు రవి కిరణ్, వేణు గోపాల్ రెడ్డి ,ఎస్ఐలు మనోజ్, అంజిరెడ్డి తదితరులు ఉన్నారు. సూళ్లూరుపేటలో సిఐ మధుబాబు పర్యవేక్షణలో ఎస్ఐ రహీమ్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు.




జాతర జోరు..!


వైభవంగా గంగమ్మకు పొంగళ్లు
తరలివచ్చిన భక్తులు, రాజకీయ నేతలు
నగరంలో ఎటు చూసినా వేషాల సందడి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. వారం రోజుల పాటు భక్తులు వివిధ వేషధారణల్లో నగరంలో సందడి చేశారు. ఆలయం వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు పొంగళ్లు పెట్టి, అమ్మవారి మొక్కులు తీర్చి దర్శించుకోవడం కనిపించింది. ఈనెల 14వ తేదీ చాటింపుతో ప్రారంభమైన జాతర బుధవారం తెల్లవారుజాముతో ముగియనుంది. ఒక్కో రోజు ఒక్కో వేషంలో భక్తులు దర్శనమిచ్చారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి గంగమ్మను ఆలయ అధికారులు, అర్చకులు అందంగా అలంకరించి, వజ్ర కిరీటం తొడిగారు. తిరుపతి నగర వాసులు తెల్లవారుజామున నాలుగు గంటలకు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద పెద్ద సంఖ్యలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ కార్యాలయాల్లో గంగమ్మ జాతర సందర్భంగా ఉద్యోగులకు ఐచ్చిక సెలవు ప్రకటించారు. జాతర సందర్భంగా వ్యాపారస్తులు, రాజకీయ నాయకులు, అమ్మవారి భక్తులు అన్నదానంతో పాటు మజ్జిగ పంపిణీ చేశారు. ఉదయం టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి,



తిరుపతి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరని శ్రీనివాసులు కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు. వారితో పాటు జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, తిరుపతి అర్బన్ ఎస్పీ హర్షవర్ధన్ రాజు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ విచ్చేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్పొరేటర్ ఆర్‌సి మునిక్రిష్ణ, దొడ్డారెడ్డి రామక్రిష్ణారెడ్డి, కంకణాల రజనీకాంత్, గంగమ్మగుడి మాజీ ఛైర్మన్ భరణియాదవ్ పాల్గొన్నారు. టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి మేయర్ శిరీషతో కలిసి స్వయంగా అన్నప్రసాద వితరణ చేశారు. చంద్రగిరి సిట్టింగ్ ఎంఎల్‌ఎ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి



వేపమండలు, వెలుగుతున్న దీపాలతో మొక్కు తీర్చుకున్నారు. బాబు జగ్జీవన్‌రామ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఉదయగిరి రఘు ఆధ్వర్యంలో వాకర్స్‌కు మజ్జిగ పంపిణీ చేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఎప్పటిలాగే రాజకీయ నేతల, ఉన్నతాధికారుల సాక్షిగా 'బలి' యథేచ్ఛగా సాగింది.



'ఆడ'వేషంలో మగోళ్ల సందడి

ఇద్దరికి డాక్టరేట్



టిఎస్ అనిత   ఎస్ వాణికుమారి

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ పరిధిలో వివిధ విభాగాల్లో పరిశోధన గ్రంథాలు సమర్పించినందుకు ఇద్దరు మహిళలకు డాక్టరేట్లు లభించాయి. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విద్యా విభాగం పరిశోధన విద్యార్థిని టిఎస్ అనితకు డాక్టరేట్ ప్రదానం చేశారు. విశ్వవిద్యాలయం విద్యా విభాగం ఆచార్యులు డాక్టర్ వి మాధవి మార్గదర్శకత్వంలో 'ఏ స్టడీ ఆన్ ఇన్స్ట్రక్షనల్ లీడర్‌షిప్ ఆఫ్ స్కూల్ హెడ్స్ ఇన్ రిలేషన్ టు దైర్ లీడర్షిప్ స్కిల్స్ అండ్ అచీవ్‌మెంట్ మోటివేషన్' అనే అంశంపై డాక్టరేట్ లభించిందని వర్సిటీ ఎగ్జామినేషన్స్ డీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అనితకి డాక్టరేట్ రావడం పట్ల రిసెర్చ్ సూపర్వైజర్, విద్యా విభాగం ఆచార్యులు, విద్యార్థులు ఆమెకు అభినందనలు తెలిపారు.

శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగం పరిశోధన విద్యార్థిని ఎస్.వాణి కుమారికి డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆ విభాగం ఆచార్యులు ప్రొఫెసర్ కె ఉషారాణి మార్గదర్శకం లో 'హైబ్రిడ్ సాఫ్ట్ కంప్యూటింగ్ టెక్నిక్ విత్ డీప్ ఫీచర్ ఎక్స్ట్రాక్షన్ టు ప్రెడిక్ట్ బ్రెస్ట్ క్యాన్సర్ యూజింగ్, మామోగ్రఫీ ఇమేజెస్' అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించినందుకు ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా ఎస్. వాణి కుమారికి పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

శాంతి భద్రతకు విఘాతం కల్పిస్తే చర్యలు: డిఎస్‌పి

ప్రజాశక్తి - ఓజిలి : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో హింసాత్మక సంఘటనలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని నాయుడుపేట డిఎస్‌పి వి శ్రీనివాసులు రెడ్డి , ఎస్ఐ పి రవిబాబు రాజకీయ పార్టీ నాయకు సూచించారు. ఓజిలి స్థానిక పోలీసు స్టేషన్లో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉందని ఎన్నికల కౌంటింగ్ రోజు ర్యాలీలు , కేక్ కటింగ్‌లు, బాణసంచా కాల్చడం , ఇతరులను రెచ్చగొట్టే వ్యాఖ్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసుల అనుమతులు లేకుండా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయుడుపేట డిఎస్‌పి శ్రీనివాసులురెడ్డి

శాంతారాంకి ఘన నివాళి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని ది స్కూల్ ఆవరణలో మునిసిపల్, దేవస్థానం మాజీ చైర్మన్ శాంతారాం రావు జె. పవార్ అయిదవ వర్ధంతి సంద ర్భంగా ఘనంగా నివాళల ర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన కుమార్తె డాక్టర్ అర్చన జె. పవార్ మాట్లాడుతూ మంచి మనిషి అయిన మా తండ్రికి మరణం ఉండదన్నారు. ఆయన ఎప్పటికీ మర్చిపోలేని ప్రజల మనిషి అని, మా మధ్యనే వున్నాడని అన్నారు. కరస్పాండెంట్ జనార్ధ రావు జె. పవార్ మాట్లాడుతూ రాజకీయాల్లో అజాత శత్రువుగా, అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పివిఆర్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రతాప్ రావు వి పవార్, జనార్ధ రావు జె. పవార్, డాక్టర్ ఆర్చన జె. పవార్ , మహేశ్వర్ రావు పడూల్కర్, హెచ్. బాబు, ది స్కూల్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



శాంతారాం జె పవార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్య

అన్నదానం

ప్రజాశక్తి-కార్వేటినగరం: కార్వేటినగరం ప్రసిద్ధి రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో కార్వేటినగరానికి చెందిన చారుమతి జ్ఞాపకార్థ ధనంజయులు కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో మంగళవారం శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ దాతలు ప్రతి వారం ముందుకొచ్చి పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు.

మేడపై నుంచి పడి బాలికకు గాయాలు

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల పంచాయతీ ముండ్రివారిపల్లి గ్రామానికి చెందిన జస్వికి(4) అనే బాలిక మిద్దిపై ఆడుకుంటూ ప్రమాదవశాత్తు పై నుంచి కిందకు పడడంతో తలకు తీవ్ర గాయమైన సంఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. కలికిరి మండలం గుండ్ల బురుజు గ్రామానికి చెందిన హరి భవిత దంపతుల కుమార్తె జస్విక ముండ్రివారిపల్లె గ్రామంలోని తన అమ్మమ్మ ఇంటికి వేసవి సెలవులకు వచ్చింది. సోమవారం సాయంత్రం సుమారు 8గంటల ప్రాంతంలో మిద్దెపై ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కింద పడటంతో తలకు తీవ్ర గాయం అయింది వెంటనే సోమల లోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకువచ్చి అటు పిమ్మట మదనపల్లికి మెరుగైన వైద్యం కోసం తీసుకెళ్లినట్టు సమాచారం.

విష జ్వరాలపై అప్రమత్తంగా వుండాలి..

పజాశక్తి-కార్వేటినగరం: వాతావరణ మార్పుల వల్ల వ్యాపించే విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవిరాజు మాట్లాడుతూ వాతావరణం మార్పుల వల్లవ్యాప్తి చెందే పలు విషజ్వరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వీధుల్లో వర్షపు నీరు నిల్వకుండా చూడాలన్నారు. తాగునీరు కలుషితం కావడం వల్ల డెంగీ, టైఫాయిడ్, డైయేరియా వంటి జ్వరాలు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. రోజులు తరబడి జ్వరం, నీరసంతో బాధపడుతున్నవారు. వెంటనే ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించాలని పేర్కొన్నారు. అడలీ బీసీజీ వ్యాక్సిన్ను 60 సంవత్సరాలు నిండి ప్రతి ఒక్కరూ వేసుకోవాలని పేర్కొ న్నారు. అదే విధంగా 18 నుంచి 59 సంవత్సరాల లోపు వారు దీర్ఘకాలిక (డైయాబిటిక్) వంటి వ్యాధులతో బాధప డుతున్న వారికి తప్పనిసరిగా అవగాహన కల్పించి వారు వ్యాక్సినే వేసుకునే విధంగా చూడాల్సిన బాధ్యత వైద్య సిబ్బ ందిపై ఉందన్నారు. అనంతరం సీహెచ్సీ ల్యాబ్ను పరిశీలించి సిబ్బందికి పలు అంశాలపై సూచనలు, సలహాలు అందిం చారు. రాత్రి సమయంలో డాక్టర్ విదుల్లో ఉంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. కార్యక్ర మంలో సీహెచ్‌సీ సినియర్ మెడికల్ అధికారి డాక్టర్ ఆనంద మూర్తి, డాక్టర్ గోపినాథ్, డాక్టర్ కీర్తి, హెల్త్ అసిస్టెంట్ అభరి షరాజు, హిదయతుల్లా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలి: ఎంపిపి

ప్రజాశక్తి -పుత్తూరు టౌన్ : వేసవిని దృష్టిలో వుంచుకుని గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని ఎంపిపి మునివేలమ్మ అధికారులను ఆదేశించారు. పుత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి మునివేలమ్మ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడివో ప్రసాదరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో విద్యుత్ కొరత లేకుండా చూసినందుకు విద్యుత్ శాఖ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు వుంటే వెంటనే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం లేకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం తడుకు సర్పంచ్ వెంకటేష్ బొబ్బిలి యాదవ్ మాట్లాడుతూ తడుకు దళితవాడలో పైపులు మరమ్మతుకు గురై గ్రామాల్లో నీటికి ఇబ్బంది లు పడుతు న్నారని తెలిపారు. విద్యుత్ శాఖ సమస్యలపై గోపాల కృష్ణాపురం సర్పంచ్, కోఆప్షన్ మెంబరు మాట్లాడుతూ విద్యుత్ తీగలు చాలా కిందే ఉన్నాయని ప్రమాదాలు చోటుచేసుకునే అవకా శాలు అధికంగా వున్నాయ న్నారు. స్పందించిన విద్యుత్ శాఖ అధికారి ఈ సమస్యను తమకు ఇంతవరకు చెప్పలేదని వెంటనే సమస్యను పరిష్కరించాలని రూరల్ అధికారిని ఆదేశిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మునుస్వామి రెడ్డి, విమలమ్మ, కోఆప్షన్ మెంబర్లు, ఎంపిటిసిలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి మునివేలమ్మ

23 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: రాష్ట్రీయ సేవ సమితి(రాస్) ఆధ్వర్యంలో నారాయణవనం మండలం పాలమంగళం గ్రామ పాఠశాల ఆవరణలో శంకర్ నేత్రాలయ చెన్నై ఆస్పత్రి వారు మంగళవారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి 23 మందిని ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేశారు. రాస్ పొదుపు సంఘాల సభ్యుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, డైరెక్టర్ నాగరాజు ఆదేశానుసారం నారాయణవనం మండలంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య పరీక్షల్లో 150 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర నేత్రాలయ ఆస్పత్రి అధికారి వెంకటముని మాట్లాడుతూ రాస్ సేవలు ప్రశంసించ తగినవని వైద్య పరీక్షలు, కంటి ఆపరేషన్‌లను వృత్తి శిక్షణ తరచూ నిర్వహిస్తున్నారని కొనియాడారు. కంటి పరీక్షలు(కంటి సమస్యలు రేట్టిన, శుక్లం వంటి కంటి పరీక్షలు) నిర్వహించడమే కాకుండా ఉచిత కంటి ఆపరేషన్ లను నిర్వహించడం ఆనందకరమన్నారు. రాస్ అధికారి రవి మాట్లాడుతూ మనకు ఎంతగానో ఉపయోగపడు తున్న రాస్ సంఘాల సభ్యులకు మాత్రమే కాకుండా వారి కుటుంబా లకు ఈ కార్యక్రమం ఉపయోగ పడటం సంతోషకరమన్నారు. వీరులో 23 మంది ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశామని తెలిపారు. వీరందరినీ ఈనెల 26వ తేదీ ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు చెన్నైలోని శంకర్ నేత్రాలయ హాస్పిటల్‌లో ఉచిత కంటి ఆపరేషన్ చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాస్ సిబ్బంది ప్రకాష్, మునిరత్నమ్మ, ముని వేలు, లక్ష్మి, ఉమ, గోవిందమ్మ పాల్గొన్నారు.



ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

అత్యధిక మెజారిటీతో గెలుస్తా..

- వెంకటగిరి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి- వెంకటగిరి: తిరుపతి జిల్లాలోని నియోజక వర్గాల్లో అత్యధిక మెజారిటీతో తాను విజయం సాధించనున్నట్లు వెంకటగిరి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన నివాసంలోని ఎన్‌జెఆర్ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ పోలింగ్ రోజు టిడిపి కవ్వింపు చర్యలకు వైసీపీ శ్రేణులు స్పందించకపోవడం ముందస్తు ప్రణాళికేనని తెలిపారు. పోలింగ్ రోజున గొడవలకు దిగకుండా ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకురావడం పైనే వైసిపి శ్రేణులు దృష్టి సారించాయన్నారు. రాష్ట్రంలో మళ్లీ వైసిపి ప్రభంజనం తథ్యమని తెలిపారు. పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు ఎప్పుడు పక్కన పెట్టిన చరిత్ర లేదన్నారు. రూ 25 వేల వేతనం కన్నా తక్కువ ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు సంక్షేమ పథకాల వర్తింపు హామీతో ఆ వర్గాల నుంచి వైసిపికి విశేష ఆదరణ లభించిందని తెలిపారు. వెంకటగిరికి పదేళ్ల ఎమ్మెల్యేగా ఉన్న కురుగొండ్ల రామకృష్ణ రైల్వే స్టేషన్ - కైవల్యా నది వరకు ఏర్పాటు చేయించిన సెంట్రల్ లైటింగ్‌కు మించి ఏడాది కాలంలో వెంకటగిరి వైసిపి ఇన్‌ఛార్జిగా ఉన్న తాను పెంచలకోన- ఏర్పేడు జాతీయ రహదారిపై వెంకటగిరిలో ఏర్పాటు చేయించిన సెంట్రల్ లైటింగ్ ఆకర్షణీయంగా ఉందని తెలిపారు.



మాట్లాడుతున్న వెంకటగిరి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి రామ్‌కుమార్‌రెడ్డి

నేదురుమల్లిని కలిసిన వైసిపీ శ్రేణులు

వైసిపీ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి వెంకటగిరి రావడంతో నియోజకవర్గం లోని రాపూరు , డక్కిలి, సైదాపురం, బాలాయపల్లి వెంకటగిరి మున్సిపాలిటీ రూరల్ మండలాలకు చెందిన పలువురు నాయకులు రామ్ కుమార్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పార్టీ గెలుపు అవకాశాలను నేదురుమల్లికి వివరించి ధీమా వ్యక్తం చేశారు.

అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు

ఉపాధి హామీ పనుల తనిఖీలో ఏపీడీ

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్:

ఉపాధి పనుల్లో అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని ఉపాధి ఏపీడీ రవికుమార్ నాయుడు హెచ్చరిం చారు. పెళ్లకూరు మండలంలోని శిరసానం బేడు ఉపాధి పనులలో అవినీతి జరుగు తున్నట్లు అందిన సమాచారంతో అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రవికుమార్ నాయుడు మంగళవారం ఆకస్మికంగా ఉపాధి హామీ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలను అడిగి సమాచారం తెలుసుకొని వారి సంఖ్యాను నమోదు చేసుకున్నారు. ప్రతి రోజు సుమారు 150 మంది నుండి 200 మంది ఉపాధి హామీ కూలీల పేర్లను నమోదు చేసి లక్షల రూపాయలు సంపాదిస్తున్నాడని స్థానికులు ఆయనకు తెలిపారు. దీనికి సంబంధించిన ఆధారాలు ఇస్తామని, రెండున్నర సంవత్సరాల క్రితం అల్లూరు మల్లికార్జున్ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ గా పని చేస్తూ అవినీతికి పాల్పడినట్లు నిరూపణ కావడంతో రెండు లక్షల రూపాయలు రికవరీ చేసి అతడిని తొలగించామని తెలిపారు. అయినా స్థానిక రాజకీయ ఒత్తిళ్లతో తిరిగి అతని భార్య అల్లూరు లత పేరుతో మళ్లీ తిరిగి అతనే ఫీల్డ్ అసిస్టెంట్‌గా కొనసాగుతూ ప్రతిరోజూ వందల సంఖ్యలో పేర్లు నమోదు చేసి అవినీతికి పాల్పడుతున్నాడని స్థానికులు తెలిపారు. ఈ విషయమై ఏ పీడీ రవికుమార్‌ను స్థానికులు వివరణ కోరగా వివరాలు సేకరించామని సోషల్ ఆడిట్ తర్వాత పని రోజులు, కూలీల సంఖ్యను పరిగణలోకి తీసుకొని నివేదికను పీడీ కి పంపి చర్యలు తీసుకుంటామన్నారు. ఈయన వెంట ఎంపీడీవో అన్నపూర్ణ రావు ,ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.



ఉపాధి పనులు తనిఖీ చేస్తున్న ఏపీడీ రవికుమార్‌నాయుడు

నేడు ఔషధ మొక్కల విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: అంతర్జాతీయ జీవ వైవిధ్య మండల దినోత్సవం సందర్భంగా పుత్తూరు ఆయుర్వేద నిలయం సహకారంతో అశ్వగంధ, మునగ, పాలకూర మొక్కల విత్తనాలను విశ్రాంత ఉపాధ్యాయులు, యోగ మాస్టర్ ఎస్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 7 గంటలకు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు పారంపర్య వైద్య మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, గ్రీన్ క్రాస్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ రాజు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటి పెరటిలో, పొలంలో పూల తోటలో ఈ గింజలను పెంచుకునేందుకు ఉపయోగంగా వుంటా యన్నారు. అశ్వగంధ ఆయుర్వేదంలో రారాజు అని, ఎలాంటి వ్యాధికైనా, అర్థం కాని వ్యాధికి సైతం అశ్వగంధాన్ని ఉపయోగిస్తారని తెలిపారు. వ్యాధి నిరోధక శక్తికి అద్భుతంగా పనిచేస్తే దివ్య ఔషధం అశ్వగంధ అని వైద్య మహా చంద్రశేఖర్ రాజు పేర్కొన్నారు. బుధవారం ఉదయం 7 గంటలకు త్రినేత్ర దివ్య దేవాలయంలో ఈ విత్తనాలను ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ప్రజాశక్తి-కార్వేటినగరం:

టీటీడీ అనుసం దానంగా ఉంటున్న రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో జరగబోయే వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఆలయం లో వేదపండితులు కోయిల్ ఆళ్వార్ కార్యక్ర మాన్ని ఘనంగా చేపట్టారు. ఈ సందర్భం గా వేకుమున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు గడ్డకర్పూరం, కిచ్చిలి ఆకు, చందనం, పసుపు వంటి సుగంధ ద్రవ్యాలను కలిపి వేద పండుతులు వేద మంత్రాల నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయ గర్భగుడిలో గోడలను సుగంద ద్రవ్యాలను పూసి శుద్ధి కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారిని పట్టు వస్త్ర సుగంద భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ సోమశేఖర్, అధికారులు సురేష్‌కుమార్, అర్చకులు నారాయణదాసరి, గోపాల ఆచారి పలువురు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో మయూరి శ్యామ్ యాదవ్‌కి చోటు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : శ్రీకృష్ణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ రైల్వే డివిజన్ డిఆర్‌యు సిసి మెంబర్ రొటేరియన్ డాక్టర్ బండి శ్యామ్ సుందరరావు(మయూరి శ్యామ్ యాదవ్) కి ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ 2006వ సంవత్సరం నుంచి సేవా కార్యక్ర మాలు చేస్తున్నానని, ఈ అవార్డు రావడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని పేర్కొన్నారు. ఈ అవార్డుతో తనపై మరింత బాధ్యత పెరిగిందని పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రెసిడెంట్ నీలం, ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ నరేంద్ర గౌడ్‌లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



అవార్డు గ్రహీత శ్యామ్ సుందర యాదవ్

వేడుకగా గంగమ్మ జాతర

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పట్టణంలోని, బజారు వీధిలో వెలసిన పిడికిలి గంగమ్మకు తిరుపతి గంగమ్మ జాతర పురస్కరించుకొని మంగళవారం ఉదయం ఆరు గంటల నుండి భక్తులు అంబలి పోశారు. వివిధ రకమైన పండ్లతో సర్వాంగ సుందరంగా అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక ప్రజలు, మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఉభయదారుల సహకారంతో ప్రసాదాలు పంపిణీ చేశారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా ఉన్న మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహానికి తిరుపతి నగర కాంగ్రెస్ అధ్యక్షులు యార్లపల్లి గోపి ఆధ్వర్యంలో పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యార్లపల్లి గోపి మాట్లాడుతూ సాంకేతిక రంగానికి మారుపేరు రాజీవ్ గాంధీ అని, నేడు అనేక లక్షల మంది యువత ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో ఉద్యోగాలు సంపాదించారంటే అది రాజీవ్ గాంధీ ముందు చూపే అని, ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ఆయనను స్ఫూర్తి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యు ఐ తిరుపతి అధ్యక్షుడు షేక్ జావేద్, యువజన కాంగ్రెస్ నగర అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ భాను ప్రకాష్, తిరుపతి నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నాగరాజు, తిరుపతి నగర కాంగ్రెస్ కార్యకర్తలు చంద్ర, శ్రీనాథ్ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: పేదల పెన్నిధి మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని పీసీసీ కార్యదర్శి డాక్టర్ బత్తెయ్యనాయుడు కొనియాడారు. రాజీవ్ గాంధీ 33వ వర్ధంతిని మంగళవారం స్థానిక పీపుల్స్ నర్సింగ్ హోమ్‌లో నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. 40 ఏళ్ల వయస్సులోనే దేశానికి ప్రధాని అయిన రాజీవ్ గాంధీ టెలి కమ్యూనికేషన్ టెక్నాలజీని, పంచాయతీరాజ్ వ్యవస్థను అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. ఆయన హయాంలో అవినీతి లేని పరిపాలన అందించారనీ, పేద, బడుగు, బలహీన వర్గాలకు ఆర్థిక అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు.

పులివర్తి నానికి పరామర్శ

ప్రజాశక్తి -రామచంద్రాపురం: తిరుపతి మహిళా యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించేందుకు వెళ్లి వైసిపి దాడిలో గాయపడిన చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిని మదనపల్లి మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాష మంగళవారం ఆయన స్వగృహంలో కలిసి పరామర్శించారు. ఆయన యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఓటమి భయంతోనే వైసీపీ దాడులు చేస్తోందని వారు ఆరోపించారు. భారీ మెజార్టీతో పులివర్తి నాని గెలవనున్నారని తెలిపారు.

ఘనంగా కన్యక పరమేశ్వరి దేవాలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: మండలంలోని పాపా నాయుడుపేటలో శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి దేవాలయంలో ఆరవ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం ఉదయం 108 కలిశాలతో గ్రామ ఊరేగింపు, అభిషేక మహోత్సవం, అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళా మండలి పరిసర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

25న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: ఏర్పేడు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 25వ తేదీ శనివారం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపిడివో ఎ గిడ్డయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలు లకు నిర్వహించే ఈ సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా శాఖ ప్రగతి పై సమీక్ష, వైద్య , ఆరోగ్య శాఖ ప్రగతి పై సమీక్ష సమావేశం, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు పన్నూరు గీత అధ్యక్షతన నిర్వహిస్తామని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్విని చేసుకోవాలని మండల ఎంపీడీవో ఎ గిడ్డయ్య తెలిపారు.

టీకాలు పంపిణీ

ప్రజాశక్తి-సోమల: మండలంలోని గొర్రెలు, మేకలకు నెత్తి పిడుగు వ్యాధి నివారణ కోసం ఈటి వ్యాక్సిన్ పంపిణీ చేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసులు నాయుడు తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతూ ఇప్పుడిప్పుడే గడ్డి మొలుస్తున్న వేళ ఆ గడ్డిని తిన్న గొర్రెలు, మేకలు క్లాస్ట్రిడియం అనే బ్యాక్టీరియా కడుపులో పెరిగి బాగా ఆరోగ్యంగా ఉన్న గొర్రెలు మేకలు ఉన్నట్లుండి క్రింద పడిపో తాయన్నారు. గిలగిలా కొట్టుకుంటూ పళ్ళు కొరుకుతూ క్షణా ల వ్యవధిలో మృత్యువాత పడతాయని తెలిపారు. దీని నివా రణ కోసం బీటీ వ్యాక్సిన్ తప్పకుండా గొర్రెలు మేకలకు వేయి ంచాలని ఇప్పటికే మండలంలో పశు వైద్య సిబ్బంది వ్యాక్సిన్ వేసే కార్యక్రమంలో ఉన్నారని తెలిపారు. పశు వైద్యా ధికారిని చందన ప్రియ మాట్లాడుతూ మండలానికి 13వేల డోసుల బీటీ వ్యాక్సిన్ సరఫరా అయిందని గొర్రెలు మేకల యజమా నులు తప్పకుండా తమ జీవాలకు వ్యాక్సిన్ వేయించాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా బెట్టింగులు

ఇటు ఐపీఎల్‌పై..అటు ఎన్నికల గెలుపుపై.. లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లోనే.. -పందెం కోసం బైకులు, ఆస్తులు, ఇతర వస్తువులు తాకట్టు.. -కొరవడుతున్న పోలీసుల పర్యవేక్షణ

పజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: అందం కోసం పందెం అన్నది ఒకప్పటి మాట. కానీ ఇప్పటి మాట మాత్రం ఈజీ మనీ కోసం పందెం అని యువత ఆరాటం.. సులువుగా డబ్బు సంపాదన కోసం కళ్ల ముందున్న అవకాశాలన్నీ పందేల కోసమే అంటున్నారు జూదరులు..ఇప్పటికే ఐపీఎల్ మ్యాచ్‌లపై పందేలు జోరుగా సాగుతుంటే మరి ఇప్పుడు సరి కొత్తగా ఎన్నికల ఫలితాలపై బెట్టింగులు మరింత ఊపందుకున్నాయి.. రోజుకో రూపం సంతరించుకుంటున్న జూదానికి టెక్నాలజీ తోడు కావడంతో సరికొత్త వ్యసనంగా మారి అరచేతిలోనే జూదం జడలు విప్పుతోంది.. ఈజీ మనీ కోసం రెచ్చిపోతున్న బెట్టింగ్ బంగార్రాజులు పందేల కోసం తమ బైకులు, ఆస్తులు, పొలాలు, ఇతర విలువైన వస్తువులు సైతం తాకట్టు పెట్టి మరీ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వీధి, వాడ, పల్లె పట్టణం అని తేడా లేకుండా పూర్తిగా విస్తరించిన బెట్టింగ్ లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లోనే జరగడం విశేషం..

అప్పుడు క్రికెట్.. ఇప్పుడు ఎన్నికల గెలుపు..

ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మంది అభిమానులు ఎంతో ఇష్టంగా ప్రేమిస్తూ చేసే క్రీడా క్రికెట్.. తమ అభిమాన క్రీడాకారుడు, దేశం కోసం మైదానంలో ఆడుతుంటే గెలుపు కోసం ప్రత్యేక పూజలు, అర్చనలు, ప్రార్థనలు సైతం చేసిన సందర్భాలు ఉండనే ఉన్నాయి. ఇంకో వైపు తమ అదృష్టాన్ని పరీక్షించుకునే క్రమంలో వేలు, లక్షల రూపాయలను అదే ఆటపై అదే ఆటగాడు మీద పందెం కాస్తున్న సందర్భాలూ నేడు కనిపిస్తున్నాయి. చిన్న పిల్లల నుండి ముసలోళ్ల వరకు కన్నార్పకుండా తిలకించి చూసే క్రికెట్ నేడు జూదరులకు అన్ని అవకాశాలను అందిస్తోందని చెప్పవచ్చు. బాస్ దగ్గర మొదలు పెడితే బంతి బంతికి, పరుగు పరుగుకు వికెట్ వికెట్ వరకు పందేలు పెరుగుతూ చివరికి గెలుపు సమయానికి అది కాస్తా తారా స్థాయికి చేరుకుంటోంది. క్రీడాకారులు ఎంతో హుషారుతో మైదానంలో ఆడుతుంటే జూదరులు మాత్రం ఈజీ మనీ కోసం తమ చేతిలో ఉన్న సాంకేతికతతో లక్షల్లో బెట్టింగులు నిర్వహిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఆస్తులు, బంగారం, బైకులను సైతం ఫణంగా పెట్టి పందేలు కాస్తూ ఇల్లు, వళ్లు గుళ్ల చేసుకుంటున్నారు. ఐపిఎల్ ప్రారంభమైన నాటి నుండి ప్రతి రోజూ జరిగే మ్యాచ్‌లో లక్షల రూపాయల పందేలను కాస్తూ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. యువకులు.. పల్లె, పట్టణం, వీధి, వాడ అని తేడా లేకుండా అన్ని ప్రాంతాలకు విస్తరించిన ఈ క్రీడా బెట్టింగ్ జూదం డబ్బు సంపాదనే ధ్యేయంగా కొనసాగుతోంది. ఇందులో ఎక్కువ శాతం యువత ఉండడం ఆందోళన కలిగించే అంశం. బెట్టింగుల కోసం అప్పులు చేయడంతో పాటు తల్లిదండ్రులకు తెలియకుండా బైకులను సైతం తాకట్టు పెట్టిన సందర్భాలు వున్నాయి. ఉద్యోగం చేస్తున్న వారు సైతం అప్పులు చేయడం, లోన్లు తీసుకుని జూదంలో తమ అదృష్టాన్ని పరీక్షించు కుంటున్నట్లు తెలుస్తోంది.. బెట్టింగ్‌లు ఇలా చేతులు మారుతున్నప్పటికీ పోలీసులు మాత్రం ఉదాసీనంగా వ్యవహరించడం పందెం రాయుళ్లకు కలిసి వస్తోంది.



ఇప్పుడు రాజకీయ బెట్టింగ్

ఒకవైపు క్రికెట్ బెట్టింగులు జరుగుతుంటే మరోవైపు రాజకీయ బెట్టింగ్‌లు అంతకంటే ఎక్కువగా సాగుతున్నాయి. ఇటీవల సార్వత్రిక ఎన్నికల సంగ్రామం ముగిసి అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో, స్ట్రాంగ్ రూములల్లో భద్రంగా ఉంటే ఇంకా లెక్కింపు కోసం ఉన్న రెండు వారాల్లో బెట్టింగ్‌లు జోరందుకున్నాయి. ఏ నియోజకవర్గంలో ఏ అభ్యర్థి గెలుస్తాడు? ఎంత మెజారిటి వస్తుంది? ఏ పార్టీకి అధికారం దక్కుతుంది.. ఇలా అన్ని వైపుల నుండి బెట్టింగులు ఊపందుకున్నాయి. వేలు, లక్షల రూపాయలు దాటిన ఈ వందేలు ప్రస్తుతం రాజకీయ నాయకుల భవిష్యత్తును తేల్చే బెట్టింగులు జోరుగా సాగుతు న్నాయి. ప్రస్తుతం జరుగుతున్న బెట్టింగులన్నీ ఆన్‌లైన్‌లోనే సాగుతుండడంతో వాటిని ఛేదించి పట్టుకోవడంలో పోలీసులకు కష్టతరంగా మారింది.

పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలి

ఐపిఎల్‌తో పాటు ఎన్నికల బెట్టింగ్‌లకు అలవాటు పడి యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. బెట్టింగ్‌లపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

పెద్దిరెడ్డిని కలిసిన నాయకులు

ప్రజాశక్తి - పూతలపట్టు:

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డిని మంగళవారం పూతలపట్టు మండల వైసీపీ నాయకుడు జగదీశ్వర్ రెడ్డి, బంగారుపాళ్యం వైసిపి నాయకులు కుమారరాజా తదితరులు ఆయన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. రాజకీయ పరిస్థితులు, పోలింగ్ విధానాలపై అన్న చర్చించినట్టు సమాచారం.